# పల్లెల్లో దళారుల దందా

- ఇష్టారీతిన ధర చెల్లిస్తూ సేకరణ
- తేమ పేరిట కోత.. నష్టపోతున్న రైతులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు


కెరమెరిలో పత్తిని కొనుగోలు చేస్తున్న ప్రైవేటు వ్యాపారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : పత్తి కొనుగోళ్లు మొదలయ్యాయో లేదో.. దళారులు రంగంలోకి దిగారు. పల్లెల్లో ఇష్టానుసారంగా పత్తిని కొనుగోళ్లు చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. మార్కెట్ యార్డుల్లో పత్తిని కొనుగోలు చేయాల్సి ఉండగా, అధికారుల కాలయాపన వల్ల రైతులు ఇబ్బందిపడక తప్పడం లేదు. పంట అమ్ముకొని అప్పులు తీర్చాలనుకునే రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తుండగా, ఇదే అదనుగా భావించి వారు దోచుకుంటున్నారు. సీసీఐ పత్తి ధర రూ.7,100గా నిర్ణయించగా, వ్యాపారులు నిర్ణయించిన ధరకే విక్రయించుకోవాల్సి వస్తుం ది. మార్కెట్ యార్డుల్లోనే పత్తికొనుగోళ్లు జరుపాలని, లేని పక్షంలో లైసెన్స్‌లు రద్దు చేస్తామని మార్కెట్ కమిటీ హెచ్చరిస్తున్నప్పటికీ వ్యాపారులు భయపడడం లేదు. ఇష్టానుసారంగా తమ వ్యాపార సముదాయాల వద్దే కొనుగోళ్లు చేపడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ను ఏమాత్రం లెక్క చేయకుండా క్వింటాలుకు రూ. 500 నుంచి రూ. 1000 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం యేటా మద్ద తు ధర ప్రకటిస్తున్నా.. వ్యవసాయ మార్కెట్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో రైతులకు ఈ పరిస్థితి తప్పడం లేదు.

## పల్లెలకు వెళ్లి.. కాంటాలు పెట్టి..

జిల్లాలోని పత్తి వ్యాపారులు జైనూర్, సిర్పూర్, వాంకిడి, కెరమెరి మండలాల్లోని పల్లెలకు వెళ్లి.. కాంటాలు పెట్టి పత్తి కొనుగోళ్లు చేపడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ. 7100 ఉండగా, పత్తి తేమ పేరిట క్వింటాలుకు రూ. 6000 నుంచి రూ. 6500 చొప్పున చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. 8శాతం వరకు తేమ ఉన్న పత్తికి పూర్తి మద్దతు ధర ఇవ్వాలని, 12శాతం తేమ ఉంటే రూ. 7 వేల ధర ఇవ్వాలని ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోవడం లేదు. తేమ పేరిట కోతలు విధిస్తున్నారు. ఇక్కడ సేకరించిన పత్తిని వాహనాల్లో తమ వ్యాపార సముదాయాలకు తరలించుకుంటున్నారు. మార్కెట్ కమిటీల కంటే ముందే కొనుగోళ్లు ప్రారంభించి తమ గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న మండలాల ద్వారా మహారాష్ట్ర తరలిస్తున్నారని తెలుస్తోంది. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌తో పాటు జైనూర్ మార్కెట్ కమిటీలు కొనుగోళ్లు ప్రారంభించలేదు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి ట్యాక్సీ రూపంలో రావాల్సిన ఆదాయానికి కూడా గండిపడుతోంది. గ్రామాల్లో విచ్చలవిడిగా జీరో వ్యాపారం సాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.


ఎడ్లబండిలో పత్తిని నింపుతున్న రైతు


అమ్మవారికి బోనాల సమర్పించేందుకు వస్తున్న శివసత్తులు


కంకలమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తుల క్యూ


అమ్మవారికి పట్నాలు పోస్తూ..


అల్లు బండ వద్ద కోరికలు కోరి బండ ఎత్తుతూ..


అమ్మవారికి మొక్కుతున్న యువకుడు

# భక్తజన సంద్రం.. కంకలమ్మ క్షేత్రం

- తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన ప్రజలు
- అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- అడిషనల్ ఎస్పీ అచ్చేశ్వర్‌రావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు

కౌటాల/చింతలమానేపల్లి, డిసెంబర్ 10 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలో స్వయంభూ శ్రీ కంకలమ్మ-కేతేశ్వర జాతర.. ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సుల్వ కనకయ్య ఆధ్వర్యంలో ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించగా భక్తులు పోటెత్తారు. తెలంగాణతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. మండల కేంద్రంలోని బస్టాండు ఏరియా నుంచి మొదలుకొని కంకలమ్మ గుట్ట వరకు భక్తజనం కిక్కిరిసింది. అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి బారులు తీరారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని అల్లుబండ వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. ముడుపులు కట్టారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. అన్నదానం చేశారు. దుకాణాల వద్ద సందడి కనిపించింది.

## అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

స్వయంభూ అమ్మవారిని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, డీఎస్పీ కరుణాకర్, సీఐలు సాదిక్‌పాషా, బుద్దే స్వామి, ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, సర్పంచ్ మానిష్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## భారీ బందోబస్తు..

జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అడిషనల్ ఎస్పీ అచ్చేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ, ముగ్గురు సీఐలు, 10 మంది ఎస్సైలతో పాటు 100 మంది సిబ్బంది పాల్గొన్నారు.


క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

కంకలమ్మ జాతరలో పిల్లల సందడి




కంకలమ్మ అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


పోలీసుల బందో బస్తు..


జాతరలో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద వస్తువులు కొనుగోలు చేస్తున్న భక్తులు


భక్తుల కోసం జాతరలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం


వెదురుతో చేసిన బొమ్మలను కొనుగోలు చేస్తూ..


ధ్వజ స్తంభం వద్ద మొక్కులు చెల్లించుకుంటుటూ..


ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం


అమ్మవారిని దర్శించుకుంటున్న అడిషనల్ ఎస్పీ అచ్చేశ్వర్ రావు, పోలీసు అధికారులు